స్కెచ్

# మరణంలోని మాధుర్యం

యాముజాల శంకరం

"ఒరేయ్ గోపీ! ఇందాకటినుండీ ఎక్కడకు పోయావురా?" అన్నది వెంకమాంబ, లోనికివచ్చి కుర్చీలో కూర్చుంటున్న గోపాలంతో

"ఎందుకే?" అన్నాడు - తిరిగి తిరిగి అప్పుడే ఇంటికి వచ్చిన విసుగుతో.

"పాపం! రామయ్యగారు పోయారురా."

"ఎప్పుడే?"

"ఇందాకనే. కొత్త బెజవాడ వెళ్ళి రెండు టెలిగ్రాము లిచ్చిరా. పాపం! వాళ్ళ అబ్బాయి శవాన్ని కౌగలించుకొని కూర్చున్నాడు. పెద్దవాడు మదరాసులో ఉన్నాడట—అతని కొకటి, రాజమండ్రీలో ఉన్న అల్లుడి కొకటి. రెండూ ఇచ్చిరా. ఇదిగో, ఈ పాతిక రూపాయిలు వాళ్ళిచ్చారు. టైం అయిపోతే ఎక్స్‌ప్రెస్ ఇచ్చిరా. ఊఁ... లే, నీతో వాళ్ళ బంట్రోతు కుర్రాడు వీరేశు కూడా వస్తాడు. సైకిళ్ళమీద పొండి.

"అబ్బ! ఇప్పు డెవరు పోతారే. కొత్తా కూస్తా వెళ్ళాలా. ఇప్పుడు బయలుదేరితే, బెజవాడ పోయేసరికి ఆరు గంటలూ అవుతుంది. రెండు గంటల ప్రయాణం ఇంచుమించు - మాటలా! నేను పోలేను."

"బాగుండదు నాయనా! ఆపద సమయంలో పక్కవారు కొంత ఆదుకోకపోతే యెలా నాయనా! ఈ రాత్రి ఏ సత్రంలోనో, ఏ హోటల్లోనో పడుకోండి. లేకపోతే తిరిగి రండి. తెలిసిందా."

అంటూ ఆ తల్లి కొడుకుని ప్రోత్సహించి, వీరేశుని పిలిచి, ఇద్దర్నీ పంపింది. వీరేశు కొంత హుషారైన కుర్రాడు. వట్టి హాస్యగాడు. హాస్యం మోటుగా ఉన్నా, వినేవాళ్లు కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వకతప్పదు. అసలు పల్లెటూర్లో పుట్టిన వీరేశుకు సైకిలు తొక్కటమంటేనే ఓ ఆనందం. ఇహ 'బస్తీకి పోతున్నానుగదా' అనుకుంటే, ఆ ఆనందానికి అంతుంటుందా.

"తొందరగా తొక్కండి బాబు! అయిదింటికల్లా ఏమైనాసరే చేరాలిసిందే" అన్నాడు వీరేశు.

"ఎందుకురా?" అన్నాడు గోపి.

"మంచి సినిమా ఆడుతోందట—పాతాళభైరవి. మావాళ్ళంతా చూశారు బాబు. మహ బాగుందట. టెలిగ్రాములిచ్చి చూద్దాం బాబూ!

అని ఆమాటా యీమాటా చెప్పి కొంత హుషారు పుట్టించాడు- గోపికి. మాటల సందట్లో, వీరేశు హాస్యపు మాటల్లో పడి, ఏమిటో తెలియని సంతోషంలో ఇద్దరూ గబగబ త్రొక్కటం మొదలు పెట్టారు.

టెలిగ్రాము లిచ్చేసరికి, సరిగ్గా ఆరుఅయింది. టెలిగ్రాములు రెండింటికి కలిసి న్యాయమైన ఖర్చు అయిదు రూపాయలయింది. ఇద్దరూ అలసిపోయారు; పైగా బాగా ఆకలి వేస్తోంది. ఇద్దరూ ప్రక్క హోటల్లో ప్రవేశించారు.

"బాబు! ఆ పళ్లెంలో ఏమిటది?" అన్నాడు వీరేశు.

"అదా! గులాబిజాము" అన్నాడు గోపి.

"ఒకటి తినాలని ఉంది బాబూ!"

"ఏడిసినట్లే ఉంది. మనమొచ్చిందెందుకు, చేసేదేమిటి? వాళ్లు చచ్చి ఒకమూల ఏడుస్తూ ఉంటే, మనం వాళ్లడబ్బుతో భాగోత మాడవచ్చటరా!"

"బాబూ! కోప్పడకండి. ఎప్పుడైనా రూపాయి ఖర్చుబెట్టే రకమేనా. మనకిదొక అవకాశం. కానియ్యండి బాబూ!"

హోటల్లో అవీ యివీ తిన్నారు. బిల్లు మూడు రూపాయలదాకా అయింది. ఇచ్చేసి బయటకు వచ్చాడు గోపి.

"ఇచ్చినవి రెండే గద బాబూ! ఎంత డబ్బు

కొట్టేశాడు. అరిబాబోయ్! వీడి అశ తగలెయ్యా, మూడు రూపాయలే!"

"మరేమిటనుకున్నావ్. ఇది బస్తీ."

"పదండయ్యా!"

దిగివచ్చి, గోపి ప్రక్క కిళ్ళీకొట్లో రెండు కిళ్ళీలు కట్టించాడు. తనొకటి వేసుకొని వీరేశు కొకటిచ్చాడు. తనొక సిగరెట్టు పెట్టె కొనుక్కొని, వీరేశుకో బీడీకట్ట కొని ఇచ్చాడు. సిగరెట్టు కాల్చబోతుంటే, వీరేశు ఒకటడిగితే ఇచ్చాడు.

వీరేశు కాలుస్తూ "భలె బాగుందండి! ఎంతండి పెట్టె?"

"తొమ్మిదణాలన్నర."

"అరిబాబోయ్! అంత ఖరీదే!"

"నడు-నడు! నీకన్నీ కొత్తగానే కనిపిస్తాయి. బొత్తిగా యెప్పుడూ బస్తీకి రాకపోతివి. ఇంకా సాగితే, ఈ ఇళ్ళన్నీ ఎవరివి? ఎవరు కట్టించారు? ఎంతకు కట్టించారు? ఎలా కట్టించారు? ఎప్పుడు కట్టించారు? ఇలా అడుగుతావు. నీకు సమాధాన మియ్యటం నావల్ల కాదు" అంటూ కాస్త విసురుగా మాట్లాడాడు. వీరేశు చిన్నబుచ్చుకున్నాడు.

కార్లు, లారీలు, సిటీ బస్సులు, సైకిళ్లు, కిటకిట లాడుతూ జనం. వీటి మధ్య సైకిలు పట్టుకొని వీరేశుకు గోపీతో నడవటం కష్టమైంది. ఎలా అయితేనేం, సినిమాకు రావడం చూడ్డం కూడా జరిగింది.

ఆట అయిన తర్వాత రోడ్డు కాస్త ప్రశాంతంగావున్నాయి. ఇద్దరూ రోడ్డువెంట నడుస్తూ ఉంటే—

"అదేమిటి బాబూ?" అన్నాడు వీరేశు.

"అది డ్రింకు షాపు"

"తింటానికేమైనా ఉంటాయా?"

"కాదు. తాగేందు కుంటాయి. నారింజ, బాదం, ద్రాక్ష వీటి రసాలమ్ముతారు."

"ఐతే మనం తాగుదాం పదండి. ఇవాళే గదండి ఏమి ఖర్చు పెట్టినా!"

"సరే" అంటూ ఇద్దరూ లోనికిపోయి చెరో బాదం పుచ్చుకున్నారు. మళ్ళీ బయలు దేరారు. దార్లో హోటల్లో అన్నం తిన్నారు. బయలుదేరుదా మనుకునేసరికి ఎదురుగుండా "బర్సాత్" అని పిక్చరు పోస్టరు కనిపించింది. అసలు హిందీ సినిమా అంటే చెవికోసుకుంటాడు గోపి. అందులో బర్సాత్, అఖిల భారత దేశంలో అమూల్యమైన ఖ్యాతిగడించిన చిత్రం.

"ఒరేయ్ వీరేశు, ఈ పిక్చరుకూడా చూచిపోదాంరా" అన్నాడు గోపి. ఇహ వీరేశు సంగతి చెప్పాలా.

బర్సాత్ చిత్రం వదలేసరికి రెండు గంటలయింది. ఈ చిత్రాల్లో వారుచేసిన ఖర్చు వివరాలు అంతగా నాకు తెలియదనుకోండి. ఏకమొత్తంగా కాక, చిల్లర ఖర్చవటంవల్ల లెక్క చెప్పలేక పోతున్నా. కాని మొత్తం మీద భలే జల్సాగా ఖర్చు చేశారంటే నమ్మండి.

సరే, ఇహ సైకిళ్లెక్కి బయలు దేరారు. సరిగా అయిదింటికల్లా స్వగ్రామం చేరుకున్నారు.

తెల్లవారిన తర్వాత లేటు రామయ్యగారి రెండవ కుమారుడు గోపీ నడిగాడు:

"ఏం నాయనా! డబ్బు సరిపోయిందా? నీ స్వంతం యేమన్నా ఖర్చయితే చెప్పు. ఇచ్చేస్తా నాయనా!" తండ్రి చచ్చిన విచారం అసలే తొంగిచూస్తున్న ముఖంలోంచి, ఏమో ఖర్చుపెట్టితే ఇచ్చేద్దామన్న ఉద్దేశ్యంతో విచారంగా అడిగాడు.

ఏ దెబ్బ ఎక్కడ తగిలితే మనిషి తలక్రిందులవుతాడో, ఈ దెబ్బ అక్కడే తగిలింది గోపికి. ఏమైనప్పటికీ సమర్థించుకోక తప్పదుగా.

"ఆం చాలా క్లుప్తంగా, ఒబ్బిడిగా ఖర్చుపెట్టాం. ఇంకా రెండు రూపాయిల దాకా మిగిలింది" అంటూ, అవీ, మిగిలిన చిల్లరా, తిరిగి ఇచ్చివేశాడు.

నా యౌవనంలో నా సోదర మానవుల చేష్టలను చూసి మండిపడి వ్యంగ్యంగా ఏదైనా వ్రాద్దామనిపించేది. ఇప్పుడు వార్ధక్యంలో వాళ్ళని చూసి జాలిపడి ఏదైనా వ్రాద్దామనిపిస్తున్నది.—వాల్ పోల్.